## అనగనగా... ఒక కథ

# కవి ఆత్మహత్య

**నా**కు చాలా సిగ్గుగా వుంది. నిజానికివ్వాళ చచ్చిపోవాలని వుంది.

* * *

నా పేరుకి మంచి పేరే వుంది.

నేను టీ.జే.రావునండీ అంటే గుర్తుపట్టనివాళ్లు ఉండరు. సాహిత్య, సాంస్కృతిక, నృత్య, సంగీత, నాటక తతిమ్మాది కళారంగాల్లో చాలాసార్లు పెద్ద పెద్ద వేదికలమీద ముఖ్యమంత్రులతోనూ, గవర్నర్లతోనూ ప్రముఖులతోనూ దండలూ శాలువాలూ కప్పించుకున్నాను. హైదరాబాదేంటి ఆంధ్రదేశంలో ఎక్కడికెళ్లినా- ఇంతో అంతో నన్ను గుర్తుపట్టేవాళ్లు ఉన్నారు.

రేపు వచ్చేనెల ఒకటవ తారీఖున తమ స్వర్ణ హస్తాలతో సువర్ణ కంకణం తొడుగుతున్నారు నాకు ఓ ప్రముఖ సాహితీవేత్త- ఆ సందర్భంగా బంధువులకీ స్నేహితులకీ, అభిమానులకీ ఉత్తరాలు, ఫోన్లు, ఆహ్వానాలు, వగైరాలతో చాలా బిజీగా వుంటున్నాను.

అదిగో..ఆ అకేషన్‌లో...విడుదల చేయాలని నా కొత్త కవితల్లో నలభై ఏరి..ఓ సంకలనం చేశాను.

బాపుగారితో నా ముఖచిత్రాన్ని ముఖ్యచిత్రంగా అట్టమీద వేయించుకున్నాను. అంతా రడీ.

కానీ ఆ 'డీటీపీ' చేస్తున్న కంపోజిటర్ వాణ్ని నా సంస్కారం విడచిపెట్టి అసభ్యమైన భాషలో తిట్టాలి నిజానికి.

అతనే ఇంటికొచ్చాడు!

తిట్టాను- నా కవితా పదజాలంతో మనసులో ఉండే కుళ్లని అక్షరాళ్లుగా మార్చి...విసిరి తిట్టాను.

అతనేం మాట్లాడలేదు- "రేపటికల్లా పూర్తి చేసి ఇస్తానండీ" అని వెళ్లిపోయాడు.

తను నోరిప్పి ఒక్కమాటంటే....నా పని ఆగిపోవచ్చు.

నా పొగరు ఆరిపోవచ్చు- అనకుండా తలదించుకుని వెళ్లిపోయాడు కన్నీళ్లతో.

* * *

అవును నిజం చెప్తున్నాను! సిగ్గులేకుండా అనుకుంటున్నాను!!

నాకు చాలా సిగ్గుగా వుంది-నిజానికివ్వాళ చచ్చిపోవాలని వుంది-

అతన్ని నేను అన్న మాటలు అన్నీ తను అనగలడు.

వాడికి...సారీ...అతనికి నాలా సంస్కారం ముసుగులేదు గనక ఇంకా అనగలడు.

కానీ అతని పరిస్థితి నాకు తెలియదు.

* * *

"మీకు ఇంత విద్వత్తూ, కవితాశక్తీ, గాడిదగుడ్డూ ఉన్నాయిగానీ...మానవత్వం లేదండీ...మీరు అతన్ని అర్థం చేసుకోకుండా అతని పరిస్థితి తెల్సుకోకుండా అడ్డమైన మాటలూ అన్నారు" అరుంధతి అంది!

"నిజానికి అతను ఇవ్వాళ వర్క్ కంప్లీట్ చెయ్యాలి"

"ఆ విషయం తనకీ తెల్సు"

"మరి..వాడు..ఆ వెధవ..."

"మాటలు తూలకండి!! వాగినవేవో చాలు!"

"నేను వాగిన దానికి అతనికేం కోపం రాలేదు- నీకెందుకుట"

"అతను మౌనంగా వెళ్లిపోయాడని..తనకి కోపం రాలేదనీ తప్పు తన నెత్తిమీద వేసుకుపోయాడనీ మీరు అనుకుంటే..మీరు మనుషుల్లో మనస్సుల్ని అసలు చదవనట్లే- మీరు రాస్తున్న కవితలూ, కథలూ, నాటకాలూ, పాటలూ అన్నీ అబద్ధాలు, అసత్యాలు అనుకోవాలి. మిమ్మల్ని మీరు మనిషిగా కప్పెట్టుకుని కవిలా బతుకుతున్నారని తెల్సుకోవాలి" అంది రోషంగా, ఉక్రోషంగా.

అరుంధతి వాగ్ధాటి నన్ను ముఖ్యంగా నాలో టీ.జే.రావుని అల్లకల్లోల పరిచింది.

చాలాసేపు బుసలు కొట్టి మౌనంగా ఉండిపోయాను.

"అతను మీ పని చేయడానికి మేం ఎక్కువ డబ్బులివ్వం! మీరు మా ప్రెస్‌కి డబ్బులివ్వక్కర్లేదని మా బాస్ అనడానికి కూడా మీమీద గౌరవంతో కాదు"

"తెల్సు నువ్ ఆ ప్రెస్ మేనేజరువి అని! నువ్ దగ్గరుండావ్...పని ఫాస్ట్‌గా చేయిస్తావని. బుద్ధితక్కువై ఇచ్చాను. ఇది నీ చేతకాని తనమే- నేను నీ ఇన్‌ఫ్లుయన్స్‌తో ఫ్రీగా పనిచేయించుకుందామని కాదు మీ ప్రెస్ కొచ్చింది- లోకల్‌గా ప్రతీ ప్రెస్సూ నా పుస్తకాల్ని ప్రింట్ వేయడానికి తహతహలాడతారు" మళ్లీ గర్జించాను!

అంతలో అరుంధతి సెల్ మోగింది.

"ఇదిగో చూడు-నీ ప్రెస్సునుంచే. నాలుగు రోజుల్లోగా బైండింగ్ అయి పుస్తకాలు మన ఇంట్లో ఉండాలని చెప్పు" హుంకరిస్తూ ఫోనిచ్చాను.

అరుంధతి కసిగా చూసి ఫోనందుకుందని నాకు తెల్సు-

"హలో.." ఎంత సాఫ్ట్‌గా మారిపోయింది తన గొంతు- తనదీ నటనే!

"అవునా.." ఎందుకో అరుంధతి గొంతు బాధగా వణికింది.

"రియల్లీ పిటీ.." ఆమెకి కన్నీళ్లు పొంగాయి.

"నేనొస్తున్నాను...వెంటనే.." ఏంటో అంత అర్జంట్..నాకూ టెన్షన్ పెరిగింది.

"ఓ యస్-నేను నా దగ్గర ఉన్న క్యాష్ తీసుకొస్తాను. జీతాలు వచ్చాక షేర్ చేసుకోచ్చు రాముా! నో ప్రాబ్లం..నేను రెండు నిముషాల్లో బైల్దేరుతున్నా" ఫోన్ ఆఫ్ చేసింది.

"చూడండీ..ఇందాకా..కోటేశ్వర్రావ్ అదే మనింటికొచ్చి మీ చేత తిట్లు తిని వెళ్లాడే..తను...అతను..ఎందుకొచ్చాడో తెల్సా...తెలీదు-మీరు అతన్ని చెప్పనీయలేదు. చెప్పినా మీరు వినిపించుకునే స్థితిలో లేరు లెండి. వాళ్ల అబ్బాయి చనిపోయాడట- 17 ఏళ్ల పిల్లాడు. రోడ్ దాటుతూ యాక్సిడెంటై..."ఏడిచింది.

"యాక్సిడెంటా? అరె ఎప్పుడైంది"

"చెప్పను-చెప్పినా అనవసరం. అతను డబ్బడగడానికి వచ్చాట్ట!" అరుంధతి గది లోపలికెళ్లి, తలుపేసుకుంది ఏడుస్తూ.

* * *

నాకు నిజంగా సిగ్గుగా వుంది- నిజానికి చనిపోవాలని వుంది.

మనిషిలో భావాల్ని చదవలేని నేను రచనల్లో హృదయాల్ని ఆవిష్కరించగలనా...ఎదుటి మనిషి చెప్పేది వినలేని నాకు సమాజానికి చెప్పే అధికారం వుందా?

నన్ను నేను పాతేసుకుని కవి గొంతుతో బతుకుతున్నానా?


అవును అరుంధతి చెప్పింది నిజం!

నేను చనిపోవాలి. కవిగా చనిపోయి మనిషిగా బతకాలి. బతకగలనా...తెలియట్లేదు.

ఇంతమంది తెల్సున్న వాళ్లు చచ్చిపోతుంటే..నాకు మరీ ముఖ్యమైన వాళ్లని పలకరించడానికి వెళ్తాను.

కన్నీళ్లు రావుగాని ఓ కవిత అశువుగా వినిపించి, ఖద్దరు సిల్కు చొక్కా మైలపడకుండా వచ్చేస్తాను చప్పట్లు కొట్టించుకుని.

ఆ 'ఎలిజీ'లన్నీ కలిపి ఓ పుస్తకం వేస్తే భావితరాలకి మార్గదర్శకంగా వుంటుందని అనుకునే వాణ్ని-



ఇప్పుడో కుర్రాడు-
మృత్యుమామ వెహికెలెక్కి
వెళ్లాల్సినంత పని ఏవుంది-
ఇప్పుడో పనివాడు
అందరాని దూరాలు
చేరుకోవాల్సిన అర్జెంటేవుంది-
ఇప్పుడో యువకుడు
అమ్మా నాన్నల కన్నీరు వైతరణిని దాటి
స్వర్గం చేరుకోవాల్సినంత ఆత్రం ఏవుంది
ఒరేయ్ కవీ...
కాయితాలు ఖరాబు చేసుకో-గానీ..
జీవితాలు నాశనం చేయకు
వాళ్ల నుదిటి మీద పిచ్చిరాతల్ని రాసి
ఓ కొత్తతరాన్ని దగా చేయకు
ఇది నా శాపం కాదు-శాసనం-
మానిషాద!! - మానిషాద!!!-

వద్దనుకున్నా కవితం ఆశువుగా పెల్లుబికింది
నే-కన్నీళ్లు పొంగకుండా, గుండె కదలకుండా
పద గుంభనతో-ఆశువుగా వచ్చే కవిత్వం
పరిమళించదు

టీజేరావ్ నువ్వింక నోరు విప్పకురా-అనుకున్నాను-గొంతు నొక్కి టీజేరావుని చంపేశాను.

తలుపు చప్పుడైంది. అరుంధతి చీర మార్చుకొచ్చింది.

"నేను వెళ్తున్నాను" అరుంధతి అంది.

"నేనూ వస్తాను"

"ఎందుకూ? అతను రేపు ఇస్తానన్నాడుగా. మీ ప్రూఫ్‌లూ-ఇస్తాడు. అతను పుత్రశోకం నుంచి కోలుకోకపోతే, ఇంకోణ్ని పెట్టినా ఇస్తాం"

"అరుంధతీ! నేనా పుస్తకం వేయను- అసలు ఇవ్వాళ్నుంచి కవిత్వమే రాయను-టీజేరావు ప్రస్తుతం మనుషుల్ని చదువుకుంటాడు-మనసుల్ని చదువుకుంటాడు-అంతే...చదువుకుంటూనే వుంటాడు-అబద్ధాలకవి ఆత్మహత్య చేసుకున్నాడు-పద" అన్నాను.

*